సాక్షి హనుమకొండ

శనివారం । 22 । జూన్ । 2024



క్రీడా పాఠశాల పిలుస్తోంది..

క్రీడా పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 4వ, 5వ తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. - 8లో



జిమ్నాస్టిక్స్ కోచ్‌పై విచారణ

జిమ్నాస్టిక్స్ క్రీడాకారులు అకాడమీ కోచ్‌పై మే నెలలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం 30°/26°

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేడి ఎక్కువ ఉంటుంది. సాయంత్రం వేళ ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

యోగాతో ఆధ్యాత్మిక భావన పెంపు..



వరంగల్ లీగల్: మనిషికి భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక సమతుల్యతను అందించడంలో యోగా ఎంతో దోహదపడుతుందని వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు నిర్మలా గీతాంబ, సీహెచ్ రమేశ్‌బాబు అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కోర్టు ప్రాంగణంలో యోగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ యోగాను రోజువారీ దినచర్యలో భాగం చేసుకోవాలని కోరారు. యోగా సాధన వల్ల శారీరక, మానసిక రుగ్మతలను పారదోలవచ్చన్నారు. ఈసందర్భంగా యోగా గురువు జితేందర్‌రావు ప్రదర్శించిన వివిధ ఆసనాలను న్యాయమూర్తులు, న్యాయవాదులు ఉత్సాహంగా వేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టి.జీవన్‌గౌడ్, బార్ అసోసియేషన్ల బాధ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధి మైనార్టీ గురుకులాల్లో ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్, పీజీటీ, స్టాఫ్ నర్స్ (ఔట్ సోర్సింగ్ పద్ధతిన) పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయా జిల్లాల మైనార్టీ సంక్షేమాధికారులు మేన శ్రీను, డి.సౌజన్య శుక్రవారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. హనుమకొండ జిల్లా పరిధి హనుమకొండ (బాలికలు) జూనియర్, పాఠశాలలో జూనియర్ లెక్చరర్లు తెలుగు, భౌతికశాస్త్రం, వృక్ష శాస్త్రం, ఆంగ్లం(పీజీటీ) పోస్టు, కాజీపేట (బాలురు) జూనియర్ లెక్చరర్ (జంతు శాస్త్రం) ఉద్యోగాలు, వరంగల్ జిల్లా పరిధిలో వరంగల్ (బాలికలు-2)లో జూనియర్ లెక్చరర్(సివిక్స్), స్టాఫ్ నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 25లోగా దరఖాస్తుల్ని ఆయా జిల్లాల కార్యాలయాల్లో అందజేయాలని వివరాలకు హనుమకొండ జిల్లాకు సంబంధించి 80749 94073, వరంగల్ జిల్లాకు సంబంధించి 93988 60995లో సంప్రదించాలని సూచించారు.

ఎంజీఎంలో విద్యుత్ తిప్పలు



ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రిలో సేవలు పొందేందుకు వచ్చిన రోగులకు విద్యుత్ తిప్పలు తప్పడం లేదు. సాధారణ వార్డులకు విద్యుత్ సరఫరా జరిగితే తప్ప విద్యుత్ అందుబాటులో ఉండదు. ఎమర్జెన్సీ వార్డుకు జనరేటర్ ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నప్పటికీ సకాలంలో సిబ్బంది స్పందించకపోవడంతో సేవలకు అంతరాయం కలుగుతోంది. శుక్రవారం ఎంజీఎం ఆస్పత్రిలోని క్యాజువాలిటీ విభాగంలో ఎమర్జెన్సీ ఎక్స్‌రే విభాగానికి గంటల తరబడి విద్యుత్ నిలిచి ఎక్స్‌రే సేవలు ఆగిపోయాయి. అంతే కాకుండా పలు వార్డులకు కరెంట్ వస్తూ.. పోతూ ఉండడంతో రోగులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చివరికి ఇదే విషయాన్ని రోగులు పరిపాలనాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో విద్యుత్ సరఫరాలో ఉన్న సాంకేతిక లోపాన్ని సవరించారు.

'జూడా'ల నిరసన



ఎంజీఎం: ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని జూనియర్ డాక్టర్లు శుక్రవారం నల్ల దుస్తులు, నల్ల బ్యాడ్జీలు ధరించి ఎంజీఎంలో నిరసన తెలిపారు. ఎంజీఎంలోని గాంధీ విగ్రహానికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. స్టైఫండ్లు సకాలంలో విడుదల కోసం గ్రీన్ ఛానల్ ఏర్పాటు, కేఎంసీలో రోడ్ల నిర్మాణం, మరమ్మతులు, జూనియర్ డాక్టర్ల కోసం కొత్త హాస్టల్ భవనాల నిర్మాణం తదితర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 24న నుంచి నిరవధిక సమ్మె కొనసాగించాలని జూనియర్ డాక్టర్స్ రాష్ట్ర అసోసియేషన్ నిర్ణయించినట్లు తెలిపారు. సమ్మె సమయంలో ఎంజీఎంలోని అత్యవసర సేవలు మినహా అన్ని సేవలకు దూరంగా ఉండాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

యోగా డే

యోగా దినోత్సవం సందర్భంగా నగరవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో, వరంగల్ ఓ సిటీ మైదానంలో ఆయా జిల్లాల ఆయుష్, యువజన క్రీడల శాఖల ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదాదేవి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, నగరవాసులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందరితో మాస్టర్ యోగాసనాలు వేయించారు. ఆరోగ్యానికి యోగా ప్రాముఖ్యతను అతిథులు వివరించారు. వరంగల్ దేశాయిపేట సీకేఎం కళాశాల మైదానంలో వికాసతరంగిణి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో త్రిదండి చినజీయర్ స్వామి పాల్గొన్నారు.







యోగాసనాలు వేస్తున్న హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదాదేవి, సీకేఎం మైదానంలో యోగాసనాలు వేస్తున్న నగరవాసులు, యోగాసనంలో చినజీయర్ స్వామి

యోగాతోనే మానసిక ఆనందం

త్రిదండి చినజీయర్ స్వామి - వివరాలు 8లో

ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

ఐనవోలు: ప్రభుత్వ బడుల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో కృషి చేస్తోందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో సుమారు రూ.18 లక్షల ఎమ్మెల్సీ, సీడీఎఫ్ అంచనా నిధులతో నూతన తరగతి గదుల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టీచర్స్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు హాజరై శిలాఫలకం ఆవిష్కరించి భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ఒంటిమామిడిపల్లి పాఠశాల గ్రామస్తుల సహకారంతో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పని చేయడం సంతోషదాయకమన్నారు. పని వేళల్ని గ్రామాల్లోని తల్లిదండ్రులు కోరుకుంటున్నట్లు గతంలో పలుమార్లు ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి వద్ద విద్యాశాఖ ఉండడంతో ప్రభుత్వ విద్యావ్యవస్థ పటిష్టమవుతుందనే నమ్మకం తనకు ఉందన్నారు. ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఒంటిమామిడిపల్లి స్కూల్‌లో పదో తరగతి వరకు విద్యాబోధన జరుగుతోందని.. సాంకేతిక కారణాల వల్ల ఎస్జీటీలు మాత్రమే విద్యాబోధన చేస్తున్నారన్నారు. స్కూల్ బైఫరికేషన్ అయితే.. ఎస్జీటీలతో పాటు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరవుతాయని అందుకు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి సహకరించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలు, పుస్తకాలు పంపిణీ చేశారు.

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ఎదుట వాగ్వాదం

ఎమ్మెల్సీ నిధులు పాఠశాలకు తేవడానికి గతంలో



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

ఎస్ఎంసీ చైర్మన్ పొన్నాల రాజు కృషి చేశారని తెలుసుకున్న ఎమ్మెల్యే.. సభాధ్యక్షుడి ద్వారా రాజును మర్యాదపూర్వకంగా వేదికపైకి పిలిపించి కూర్చోబెట్టారు. ఇది గిట్టని కొంతమంది కాంగ్రెస్ నాయకులు మాజీ చైర్మన్‌కు వేదికపై స్థానం ఉండదని.. కిందికి దిగిపోవాలని డిమాండ్ చేశారు. కాగా.. రాజుకు కాంగ్రెస్ నాయకులకు మధ్య కొద్దిసేపు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల ఎదుటే వాగ్వాదం జరిగింది. ఎలాంటి అర్హతలేని అధికార పార్టీకి చెందిన మండల నాయకులు వేదికపై ఎలా కూర్చుంటారని ప్రశ్నించారు. దీంతో సదరు అధికార పార్టీ నాయకులు, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ రాజు వేదిక మీది నుంచి కిందికి దిగారు. పాఠశాల హెచ్ఎం ప్రతాప రత్నకుమార్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో ఎంపీటీసీ కడుదూరి రాజు, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ పొన్నాల రాజు, ఎంఈఓ వెంకటేశ్వర్ రావు, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీడీఓ పులి వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ డైరెక్టర్ మేట చిరంజీవి, నాయకులు సమ్మెట మహేందర్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రుడికి మంత్రి బండి సంజయ్ పూజలు

ఎల్కతుర్తి: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శుక్రవారం రాత్రి భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రుడికి ప్రత్యేక పూజలు చేశారు. కేంద్ర మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం మొట్ట మొదటిసారిగా ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లో పర్యటించిన ఆయనకు స్థానిక బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. మొదట ఎల్కతుర్తికి చేరుకున్న ఆయనకు మహిళలు, పార్టీ శ్రేణులు బంతిపూలు చల్లుతూ మంగళ హారతులు, డప్పుచప్పుళ్ల నడుమ ఘనస్వాగతం పలికాయి. అక్కడినుంచి భీమదేవరపల్లి మండలం ముల్కనూరుకు చేరుకుని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మంత్రి వీరభద్రస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు



మంత్రికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

ఆయనకు ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, రాష్ట్ర నాయకులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, మార్తినేని ధర్మారావు, ఇనుగాల పెద్దిరెడ్డి, బుజ్జ సత్యనారాయణ, శ్రీను, పార్టీ మండల అధ్యక్షులు కుడితాటి చిరంజీవి, పైడిపల్లి పృథ్వీరాజ్, జనగాని కిష్టయ్య, ఎర్రగొల్ల శ్రీను, కంచర్ల శంకరయ్య, ఆడేపు శ్రీవర్ధన్, ముష్కె వెంకటేష్, మంతుర్తి శ్రీకాంత్, మధుకర్ రావు, ఆరేపల్లి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు కంట చెమ్మ!

- పరకాల పెద్ద చెరువు మట్టి తరలింపు
- వందల ట్రిప్పులు.. కోట్లకు పడగలు!
- ఇరిగేషన్ అధికారుల ప్రేక్షక పాత్ర



పెద్ద చెరువులో అనుమతి లేకుండా జేసీబీ, ట్రాక్టర్లతో మట్టి తవ్వకాలు

పరకాల: నీటిని ఒడిసి పట్టి సిరుల పంటలకు ఆధారమయ్యే చెరువులిప్పుడు కంట తడి పెడుతున్నాయి. మట్టి దొంగల తవ్వకాలతో ఆనవాళ్లను కోల్పోతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో పరకాల పెద్ద చెరువులో మట్టి దొంగల ఆగడాలు పెరిగిపోయాయి. మొన్న దామెర చెరువు.. నిన్న ఎర్ర చెరువు.. నేడు పరకాల పెద్ద చెరువు మట్టిదందాకు అడ్డాలుగా మారాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే పగలు.. రాత్రి తేడా లేకుండా మట్టిని తరలిస్తుంటే ఇరిగేషన్ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. నిన్నటి వరకు నాటుసారా.. బియ్యం దందా చేసిన దొంగలంతా నేడు కొత్త అవతారమెత్తారు. జేసీబీలు, ట్రాక్టర్లు కొని కొత్త దందా (మట్టి వ్యాపారం) మొదలుపెట్టారు. మట్టి దందాతో మున్సిపాలిటీలో విలీనమైన ఓ గ్రామానికి చెందిన ఒకరు కొట్లకు పడగలెత్తగా.. కొత్తగా మరొకరు ఎలాంటి అనుమతులు లేకుండానే.. పరకాల పెద్ద చెరువు తన సొత్తు అన్నట్లుగా మట్టి తవ్వకాలు మొదలుపెట్టారు.

నీటి నిల్వలు తగ్గుముఖం..

ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పునకు రూ.1,000 నుంచి రూ.1,500లకు విక్రయిస్తున్నారు. రెండేళ్లుగా అనుమతికి మించి పరకాల పెద్ద చెరువులో మట్టి తవ్వకాలు జరిపి నీటి నిల్వలు తగ్గుముఖం పట్టేలా చేశారు. ప్రస్తుతం ఇదే పంథాలో కొత్తగా కొందరు చెరువు మట్టి విక్రయిస్తూ లక్షలు మూటగట్టుకుంటున్నారు. అయినప్పటికీ అధికారయంత్రాంగం పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెరిగిన ధరలతో పాటు మట్టి ధరలను చూసి సామాన్యుడు ఇల్లు కట్టుకోవాలంటే భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. రెండేళ్ల క్రితం రూ.500 నుంచి రూ.800 వరకు ఉండగా.. నేడు ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పునకు రూ.1,200 నుంచి రూ.1,600 వరకు అమ్ముకుంటున్నారు. దీంతో ఒక్కో ఇంటికి మట్టి ఖర్చే రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు అవుతోందని సామాన్యుడు ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పునకు రూ.300లు మిగుల్చుకునే రోజుల నుంచి రూ.1,000లకు పెరిగిందని చెప్పవచ్చు. ఇదే ఆసరాగా చేసుకొని మట్టి దందా చేస్తున్న వారు అనుమతి లేకుండా దర్జాగా 20 ట్రాక్టర్లతో పరకాల పట్టపగలే చెరువు మట్టిని తరలిస్తున్నారు. రియల్ వ్యాపారులకు, పెద్ద పెద్ద ప్లాట్లలకు వందలాది ట్రాక్టర్ల ట్రిప్పుల మట్టిని తరలిస్తూ.. లక్షలాది రుపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. తమకు అందిన సమాచారంతో మట్టి తరలింపును అడ్డుకున్నట్లు ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్ 'సాక్షి'కి ఫోన్‌లో తెలిపారు. ఎవరైనా చెరువుల్లోని మట్టిని తరలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరడం విశేషం.

మట్టిదందాపై ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలి

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పరకాలలో జరుగుతున్న మట్టి దందాపై చర్యలు తీసుకోవాలి. లేకపోతే భవిష్యత్‌లో పరకాల చెరువుల్లో నీళ్లు నిలవవు. రైతులు సాగు నీరు, తాగునీటికి ఇబ్బందులు పడతారు. మట్టిదందాను ప్రోత్సహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి.

– మేఘనాథ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు

ఉపాధ్యాయుల వేకెన్సీ జాబితా వెల్లడి

విద్యారణ్యపురి: ఎస్జీటీల తత్సమానమైన ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియకు సంబంధించిన వేకెన్సీల వివరాల్ని ఉపాధ్యాయ సంఘాలకు, ఆయా టీచర్ల వాట్సాప్ గ్రూపులకు అధికారులు శుక్రవారం పంపించారు. హనుమకొండ జిల్లాలో ఎస్జీటీల తత్సమాన ఉపాధ్యాయుల వేకెన్సీలు 357 ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. అందులో క్లియర్ వేకెన్సీలు 202, 8 ఏళ్లు పూర్తి చేసుకున్న టీచర్ల వేకెన్సీలు 155 వరకు ఉన్నట్లుగా ప్రాథమికంగా సంబంధిత విద్యాశాఖ అధికారులు గుర్తించారు. స్పౌజ్ కేటగిరీలో బదిలీలు కావాలనుకునేవారు సమర్పించిన దరఖాస్తులో ఏమైనా మార్పులుంటే దరఖాస్తులు చేసుకోవచ్చని హనుమకొండ డీఈఓ ఎండీ అబ్దుల్‌హై తెలిపారు. స్పౌజ్ ఇప్పటికే బదిలీ అయినా.. ఉద్యోగ విరమణ పొందినా, దివ్యాంగులై ఉన్నా ఈనెల 22వ తేదీ(శనివారం) సాయంత్రం వరకు 99481 88254కు వాట్సాప్ ద్వారా దరఖాస్తుస్తు చేసుకోవచ్చని సూచించారు. అదేవిధంగా వరంగల్ జిల్లాలో మరో 76 మంది తత్సమాన స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతుల ఉత్తర్వులు అందాయి. వరంగల్ జిల్లాలో మొత్తం 434 మంది టీచర్లకు పదోన్నతుల ఉత్తర్వులు అందాయి. వరంగల్ జిల్లాలోనూ ఎస్జీటీ తత్సమాన ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ జరగనుంది. వేకన్సీలు 606 ఉన్నాయి. క్లియర్ వేకెన్సీలు 278 ఉన్నాయి, 8సంవత్సరాలు పూర్తిచేసుకున్న టీచర్ల వేకన్సీలు 328 ఉన్నాయి. వీటిపై అభ్యంతరాలుంటే ఉపాధ్యాయులు డీఈఓ కార్యాలయంలో తెలియజేయాల్సి ఉంటుంది.

తెరమీదకు మరోసారి..

గొర్రెల పంపిణీ పథకంలో అక్రమాల లెక్కలు

- జిల్లాల వారీగా వివరాలు కోరిన ఈడీ
- గతంలో ఉమ్మడి వరంగల్‌లో 10 మందిపై విచారణ
- ముగ్గురు అధికారులపై చర్యలకు ఆదేశం.. మళ్లీ సమగ్ర విచారణకు రంగంలోకి ఈడీ..
- ఈడీ, సమాఖ్యల ఆదేశాలతో నివేదిక తయారీలో డీవీఏహెచ్‌ఓలు



ఎల్కతుర్తి మండలం కేంద్రంలో పట్టుబడిన లారీలు, గొర్రెలు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, వరంగల్:

గొర్రెల పంపిణీ పథకంలో ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా జరిగిన అక్రమాలు మరోసారి తెర మీదకు రాబోతున్నాయి. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకాన్ని పక్కదారి పట్టించిన వారి అవినీతి అక్రమాలు మళ్లీ వెలుగుచూడబోతున్నాయి. అక్రమార్కులపై అప్పటి ప్రభుత్వం మొక్కుబడిగా చర్యలు తీసుకుని కేసులు మూసేయగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ అక్రమాలను తోడుతోంది. గొర్రెల పంపిణీ పథకంలో అక్రమాలపై మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద విచారణ చేపట్టిన కేంద్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) 2017 నుంచి 2023 డిసెంబర్ వరకు ఈ పథకానికి సంబంధించిన సమస్త సమాచారం జిల్లాల వారీగా కావాలని గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య, పశుసంవర్ధక శాఖను ఇటీవల కోరింది. ఈనేపథ్యంలో కలెక్టర్లకు అందిన సమాచారం మేరకు ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాల్లో గొర్రెల పంపిణీ పథకానికి సంబంధించిన సమాచారాన్ని ఆయా జిల్లాల జిల్లా పశువైద్య, పశు సంవర్ధకశాఖ అధికారు(డీవీఏహెచ్‌ఓ)లు నేడే, రేపో పంపేందుకు సిద్ధం కావడం ఆ శాఖలో మళ్లీ కలకలం రేపుతోంది.

మొదటి విడత సాగిందిలా..

ఉమ్మడి వరంగల్‌లో 575 సహకార సంఘాలు, సుమారు 60 వేల మంది సభ్యులను గుర్తించిన అప్పటి ప్రభుత్వం ఆ మేరకు విడతల వారీగా అర్హులకు లబ్ధి చేకూరేలా ప్లాన్ చేసింది. మొదటి విడత (ఎ-లిస్టు)లో మొత్తం 50,678 యూనిట్లు మంజూరు చేసి, ప్రతి యూనిట్‌కు 20 గొర్రెలు, ఒక పొట్టేలు చొప్పున జిల్లాల వారీగా కోటా నిర్ణయించి పంపిణీ చేశారు. జిల్లా అధికార యంత్రాంగం ఇద్దరు ఏడీలు, ఒక డాక్టర్, ఇద్దరు పారా సిబ్బంది ఒక కమిటీగా మొత్తం ఉమ్మడి జిల్లాలో సుమారు 12 కమిటీల ద్వారా కొనుగోళ్లు, పంపిణీ చేసింది. మహారాష్ట్రతోపాటు కడప జిల్లాలోని ఆరు మండలాల్లో గొర్రెల కొనుగోళ్లు చేపట్టారు. వాటికి ఇన్సూరెన్స్ ట్యాగ్‌లు పూర్తయిన అనంతరం అక్కడి నుంచి వాహనాల ద్వారా జిల్లాకు పంపాల్సి ఉండగా.. ఇక్కడే అనేక అక్రమాలు జరిగినట్లు అప్పట్లోనే ఒక్కొక్కటిగా బయటకు వచ్చాయి. తాజాగా ఈడీ ఆదేశాల మేరకు పాత వరంగల్ జిల్లా పరిధిలో ఏర్పడిన జిల్లాల్లో లబ్ధిదారులకు 50,678 యూనిట్లకు 49,276 యూనిట్లు (97శాతం) గ్రౌండింగ్ చేసినట్లు ఇప్పటివరకు తేలినట్లు సమాచారం. అలాగే రెండో విడత గ్రౌండింగ్ తదితర వివరాలను సైతం క్రోడీకరించి రెండు, మూడు రోజుల్లో ఈడీకి నివేదిక పంపేందుకు సిద్ధమైనట్లు ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ డీవీఏహెచ్‌ఓ స్థాయి అధికారి ఒకరు 'సాక్షి'కి తెలిపారు.

అడుగడుగునా అక్రమాలే.. నివేదికలో వివరాలు అవే...

పథకం ఆరంభంలో శ్రద్ధ వహించిన ఉన్నతాధికారులు రానురానూ మండల పశువైద్యాధికారులకే జీవాల కొనుగోలు బాధ్యత ఇచ్చారు. దీంతో గొర్రెలు లబ్ధిదారుల ఇంటికి చేరకముందే చేతులు మారాయి. కొన్నిచోట్ల ఇతర ప్రాంతాల నుంచి రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వరకు చేరుకొని, మళ్లీ తరలిపోయాయి. ఈఅక్రమాల తంతులో పలువురు మండల పశువైద్యాధికారులే కీలక పాత్ర పోషించినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. కొనుగోలుకు వెళ్లిన అధికారులు అటు అమ్మకందారులతో ఒప్పందం కుదుర్చుకొని తక్కువ ధర పలికే గొర్రెలకు ఎక్కువ ధర నిర్ణయించడం.. ఒక యూనిట్‌లో నాలుగు చిన్న పిల్లలను వేసి పెద్దవాటికి సమానంగా వెల కట్టడం వంటివి చేయడంతో లబ్ధిదారులు ఆర్థికంగా నష్టపోయారు కూడా... గొర్రెలను ఏడాదిలోపు విక్రయించరాదన్న నిబంధనలున్నా.. వారంలోపే అమ్మారు. రీసైక్లింగ్ కూడా చేసిన దాఖలాలు బయటపడ్డాయి. గొర్రెలు క్షేత్రస్థాయిలో లేకున్నా.. గొర్రెలు, వాటి పిల్లల పేరిట దాణా, నట్టల మందులకు కూడా డబ్బులు కాజేశారు. వీటన్నింటిపై వివరంగా నివేదిక సిద్ధం చేస్తుండడంతో మళ్లీ ఏం జరుగుతుందో? నన్న చర్చ అందుకు బాధ్యులైన వారిలో మొదలైంది.


ఆ గొర్రెలు ఎవరివి? ఇప్పటికీ తేలని లెక్క.. బ్యాంకులో డబ్బుల జమ..

వరంగల్ జిల్లా నుంచి ఎల్కతుర్తి నుంచి అక్రమంగా తరలిస్తున్న ఐదు లారీలతోపాటు 574 గొర్రెలను 2019 పోలీసులు పట్టుకున్నారు. ఈసందర్భంగా 13 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఆ 13 మంది కూడా తమకు సంబంధం లేదని తప్పుకున్నారు. దీంతో ఆ గొర్రెలను విక్రయించిన పశుసంవర్ధకశాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆ డబ్బులను బ్యాంకులో జమ చేశారు. ఆ గొర్రెలు ఎవరివి? ఎక్కడినుంచి తరలించారు? అనే వివరాలను ఇప్పటికీ తేల్చలేదు.

- చిల్పూరు మండలం చిన్నపెండ్యాలలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన 12 యూనిట్లలో అవకతవకలు చోటు చేసుకోవడంతో అక్కడి పశువైద్యాధికారిని సస్పెండ్ చేశారు. మొదటి విడత గొర్రెల పంపిణీ పథకంలో అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో 10 మందిపై శాఖాపరమైన ప్రత్యేక బృందాలు విచారణ జరిపి 'మమ' అనిపించాయి.
- జయశంకర్ భూపాలపల్లికి చెందిన డీవీఅండ్‌ఏహెచ్‌ఓ డాక్టర్ ఎం.బాలకిషన్, జనగామ జిల్లా బచ్చన్నపేట వీఏఎస్ డాక్టర్ కె.హరికిషన్‌పై చర్యలకు ఫెడరేషన్ ఎండీకి చేసిన ఫిర్యాదులు బుట్టదాఖలయ్యాయి. వీటితో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరిగిన అక్రమాలు, అవకతవకలు మరోసారి వెలుగు చూడనుండడం పశుసంవర్ధకశాఖలో చర్చనీయాంశంగా మారింది.

రాష్ట్ర సాధనే లక్ష్యంగా జీవించిన జయశంకర్

డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి




జయశంకర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ: జీవితాంతం తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా బతికిన మహానుభావుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం హనుమకొండ ఏకశిల పార్కులోని జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ సమైక్య పాలనలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ఎలుగెత్తి చాటడంతోపాటు జనాన్ని జాగృతం చేయడంలో ప్రొఫెసర్ జయశంకర్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు తోట వెంకన్న, బంక సరళ, వెంకట రాజ్ కుమార్, బంక సంపత్, వీరగంటి రవీందర్, మాధవిరెడ్డి, చీకటి ఆనంద్ నలుబోల సతీశ్, వల్లపు రమేశ్, పాలడుగుల ఆంజనేయులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రయోజనాలే లక్ష్యంగా పోరాడుదాం

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్



జయశంకర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వినయ్‌భాస్కర్, నాయకులు

హన్మకొండ: తెలంగాణ ప్రయోజనాలే లక్ష్యంగా పోరాడుదామని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని జరుపుకున్నారు. అంతకుముందు బాలసముద్రంలోని ఏకశిల పార్కులోని జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ బంగారు తెలంగాణ నిర్మాణంలో సైనికులమవుతామన్నారు. తెలంగాణే శ్వాసధ్యాసగా జీవించిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏకశిలా పార్కును జయశంకర్ స్మృతివనంగా తీర్చిదిద్దిందన్నారు. కార్యక్రమంలో టీజీపీ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

రుణమాఫీపై నివేదిక అందజేత



తుమ్మల నాగేశ్వరరావును సన్మానిస్తున్న మార్నేని రవీందర్

హన్మకొండ : రైతు రుణమాఫీపై తెలంగాణ రాష్ట్ర అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, ఉపాధ్యక్షుడు కొత్తకుర్మ సత్తయ్య, పాలకవర్గ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేశారు.ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును టీఎస్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, పాలక వర్గ సభ్యులు కలిశారు. రుణమాఫీ నివేదిక అందించడంతో పాటు శాలువా కప్పి పుష్ప గుచ్ఛం అందించి సన్మానించారు. రైతుల రుణ మాఫీపై చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా సహకార బ్యాంకుల్లో ఋణం తీసుకున్న 7,74,833 రైతులకు సంబంధించిన రుణాల మాఫీపై నివేదిక అందించారు. డీసీసీబీలో తీసుకున్న రుణాల మాఫీపై సానుకూలంగా స్పందించిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వర రావు, మంత్రి మండలికి మార్నేని కృతజ్ఞతలు తెలిపారు.

సీఐపై హెచ్‌ఆర్సీలో ఫిర్యాదు



హెచ్‌ఆర్సీలో ఫిర్యాదు చేస్తున్న నవీన్

జనగామ : అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో తమను వేధిస్తున్నాడని జనగామ మండలం వెంకిర్యాలకు చెందిన నవీన్‌కుమార్ స్థానిక సీఐ రఘుపతి రెడ్డిపై శుక్రవారం హైదరాబాద్‌లోని మానవ హక్కుల కమిషన్(హెచ్‌ఆర్సీ) లో ఫిర్యాదు చేశాడు. అనంతరం నవీన్ మాట్లాడుతూ తనపై దాడి చేసిన వారిని కాపాడే ప్రయత్నంలో కాంగ్రెస్ నేతలకు తలొగ్గి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారని తెలిపాడు. మే 28వ తేదీన దాడికి పాల్పడగా ఇందుకు కాపాడే ప్రయత్నం చేసిన తన తల్లిని సైతం గాయపర్చారన్నారు. కాగా విషయం తెలుసుకున్న తన సోదరుడు డయల్-100 ఫోన్ చేసి, చికిత్స కోసం తమను జిల్లా ఆస్పత్రికి తీసుకు వెళ్లారన్నారు. అప్పటి కూడా పోలీసులు రాలేదని, అదే రోజు రాత్రి పీఎస్‌లో ఫిర్యాదు చేశామన్నారు. సమగ్ర విచారణ చేసి తమకు న్యాయం చేయడంతో పాటు సీఐపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

అడవి దుంపలు తిని పలువురికి అస్వస్థత



చికిత్స పొందుతున్న గ్రామస్తులు

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని వీఆర్‌కే పురం గ్రామానికి చెందిన ఐదుగురు అడవి దుంపలు తిని శుక్రవారం అస్వస్థతకు గురయ్యారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నవ్య, మల్లక్క, రమ్య, రాజు, సరోజిని మల్లాపురం పరిధిలోని రాఘవమ్మ చెరువు అటవీ ప్రాంతంలో అడవి దుంపలను (తెల్ల శనగ గడ్డలు) తవ్వి ఇంటికి తీసుకు వచ్చారు. అనంతరం వాటిని ఉడక బెట్టుకోని తినడంతో వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారిని వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

బ్యూటీషియన్ శిక్షణ విజయవంతం

'సాక్షి' మైత్రి మహిళ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు శిక్షణ

- శ్రీ శైలి బ్యూటీపార్లర్ సౌజన్యంతో నిర్వహణ



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సాక్షి వరంగల్ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్

హన్మకొండ చౌరస్తా : చిన్న శుభకార్యం నుంచి వివాహ వేడుకల వరకు నలుగురిలో ప్రత్యేకంగా కనిపించేందుకు మహిళలు ఆరాట పడుతుంటారు. అందుకు పదిరోజుల ముందు నుంచే దగ్గరలోని బ్యూటీపార్లర్‌కు వెళ్తుంటారు. అయితే ప్రతి మహిళ సొంతంగా బ్యూటీషియన్ కోర్సు నేర్చుకుంటే ఖర్చుతో పాటు సమయం ఆదా అవుతుంది. అలాగే ఉపాధి సైతం పొందవచ్చు. అలాంటి మహిళల కోసం «సాక్షి» మైత్రి మహిళ ఆధ్వర్యంలో బ్యూటీషియన్ కోర్సు నేర్చుకునేందుకు అవకాశం కల్పించింది. హనుమకొండ చౌరస్తాలోని శ్రీ శైలి బ్యూటీపార్లర్ సహకారంతో నెల రోజుల పాటు బ్యూటీషియన్ కోర్సులో మహిళలు, యువతులకు శిక్షణ ఇచ్చారు. మెట్రో నగరాల్లోని కార్పొరేట్ బ్యూటీపార్లర్లకు తీసిపోని విధంగా సాక్షి మైత్రి, శ్రీ శైలి బ్యూటీపార్లర్ల సంయుక్త ఆధ్వర్యంలో అందించిన శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి సాక్షి వరంగల్ యూనిట్ బ్రాంచ్ మేనేజర్ వి.శ్రీనివాస్, శ్రీ శైలి బ్యూటీపార్లర్ నిర్వాహకురాలు రచ్చ రజిని పాల్గొని శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా సాక్షి బ్రాంచ్ మేనేజర్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో ఎదగడానికి, వారిని వివిధ రంగాల్లో ప్రోత్సహించడంలో సాక్షి ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. ఇలాంటి శిక్షణ తరగతుల్లో మీరు సైతం పాల్గొనాలంటే 95055 14424లో సంప్రదించాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఈవెంట్ మేనేజర్ ఎస్.సుమన్, సాక్షి బృందం పాల్గొన్నారు.

సాక్షి మంచి కార్యక్రమం చేపట్టింది



'సాక్షి' మైత్రి మహిళలకు ఎంతగానో ఉపయోగపడే మంచి కార్యక్రమం. మహిళలు ఎంతో ఇష్టపడే బ్యూటీషియన్ శిక్షణతో ప్రయోజనాలున్నాయి. మమ్మల్ని ఇందులో భాగస్వాములను చేయడం సంతోషం. సాక్షి ఇచ్చిన స్ఫూర్తితో తక్కువ ఖర్చుతో ప్రతి మహిళకు బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. శిక్షణలో పాల్గొన్న మహిళలకు అన్ని రకాల మెళకువలు నేర్పించాం. సాక్షి అందిస్తున్న అవకాశాన్ని వినియోగించుకునేందుకు మహిళలు ముందుకు వస్తున్నారు.

-ఆర్.రజిని, బ్యూటీపార్లర్ నిర్వాహకురాలు

శిక్షణతో ఉపాధి అవకాశాలు



నెల రోజుల పాటు మేము తీసుకున్న శిక్షణతో సొంతంగా బ్యూటీపార్లర్ ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందగలమనే నమ్మకం వచ్చింది. ప్రతి రోజు చిన్న పిల్లల మాదిరిగా నిర్వాహకులు మంచి శిక్షణ అందించారు. సాక్షి పత్రికలో ప్రకటన చూడగానే బ్యూటీషియన్‌లో శిక్షణ పొందాలని తలుచుకుని నేర్చుకున్నాను.

- సింధు, ధర్మారం, రవళి, హసన్‌పర్తి

ఇంట్లోనే మేకప్ వేసుకోవచ్చు



గతంలో సాధారణ మేకప్‌తోనే సరిపెట్టుకునే వాళ్లం. అందంగా కన్పించాలంటే ఇప్పటి వరకు బ్యూటీపార్లర్‌కు వెళ్లాం. ఇక నుంచి సొంతంగా తమకు తాముగా మేకప్ వేసుకోగలము. ఇంటి వద్దే తమకున్న తక్కువ సమయంలో అందంగా తయారు కావడానికి ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుంది. సాక్షి మైత్రి ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నందుకు సంతోషంగా ఉంది.

- ఎస్. కల్యాణి, మంగపేట, కె.రజిత, అశోక్‌నగర్

అవగాహన వచ్చింది



మహిళలు అందంగా కనిపించేందుకు మేకప్ చాలా అవసరం. మాకు పార్టీవేర్, బ్రైడల్, నార్మల్ మేకప్స్‌తో పాటు వివిధ రకల మేకప్‌లను సులువుగా చేయడం ఎలాగో ఈ శిక్షణ ద్వారా తెలుసుకున్నాము.

- పి.లావణ్య, వరంగల్, వి.భాను, వరంగల్

ఇతరులకు ఉపాధి కల్పిస్తాం..



సాక్షి దినపత్రికలో ప్రకటన చూసి, శిక్షణ తరగతులకు వచ్చాం. నెల రోజుల పాటు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. అంతేగాక ప్రాక్టికల్‌గా మాతో చేయించి మెళకువలు నేర్పించారు. బ్యూటీపార్లర్ ఏర్పాటు చేసుకుని, ఇతరులకు సైతం ఉపాధి చూపే ఆత్మస్థైర్యాన్ని శిక్షణ తరగతుల ద్వారా నిర్వాహకులు అందించారు.

- జ్యోతి, చిన్నపెండ్యాల, ఎం.చైతన్య, కొమ్మాల

ఎరువుల దుకాణంలో ఆకస్మిక తనిఖీ



ఇనుగుర్తి: దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

కేసముద్రం : అనుమతి లేకుండా నిల్వ చేసిన వరి, పత్తి విత్తనాలను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయ శాఖ అధికారులు సీజ్ చేసిన ఘటన ఇనుగుర్తి మండల కేంద్రంలోని ఓ ఎరువులు, విత్తన దుకాణంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఇనుగుర్తి మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహ ఎరువులు, విత్తనాల దుకాణంలో వరంగల్ విజిలెన్స్ సీఐ అనిల్‌కుమార్, విజిలెన్స్ ఏఓ శ్రీనివాస్, కేసముద్రం ఏఓ వెంకన్నతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు దుకాణంలో పలు రికార్డులను, గోదాంను వారు పరిశీలించారు. ఎలాంటి అనుమతి లేకుండా గోదాంలో నిల్వ చేసిన 14.14 క్వింటాళ్ల వరి విత్తనాలు, 23 పత్తి ప్యాకెట్లను వారు గుర్తించారు. రూ.1.55 లక్షల విలువైన వరి, పత్తి విత్తనాలను సీజ్ చేసి, 6ఏ కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు పంపించినట్లు ఏఓ వెంకన్న తెలిపారు.

బంగారంతో గుమస్తా పరార్

- రూ.48 లక్షల బంగారం చోరీ

రామన్నపేట : వరంగల్ విశ్వకర్మ వీధికి చెందిన బంగారం వ్యాపారి సంజయ్ వద్ద గుమస్తాగా పనిచేస్తున్న సురేష్ 800 గ్రాముల బంగారంతో పరారైనట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు. సంజయ్ వద్ద సురేశ్ రెండు వారాల నుంచి గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఈ నెల 14వ తేదీన రాత్రి సంజయ్ చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వెళ్లగా కరగదీసిన 800 గ్రాముల బంగారం బిస్కెట్‌తో పరాయ్యాడు. కాగా సురేశ్ స్వగ్రామం మహారాష్ట్రలోని సతార్ జిల్లా భాగ్యనగర్‌గా గుర్తించి అక్కడికి వెళ్లారు. అయినా అక్కడ అతడి ఆచూకీ లభించక పోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సంజయ్ తెలిపారు. దొంగలించిన బంగారం విలువ రూ.48 లక్షలు వరకు ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

యోగాతోనే మానసిక ఆనందం



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, నగరవాసులు

జీవన సాఫల్యానికి యోగా దోహదం

- త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి
- సీకేఎం కళాశాల మైదానంలో ఘనంగా యోగా దినోత్సవం
- వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఆసనాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చినజీయర్ స్వామి

హన్మకొండ కల్చరల్ : యోగా జీవితంలో ఒక భాగమని, యోగ సాధనతో శరీర శుభ్రతతో పాటు మనసు ఆనందంగా ఉంటుందని శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్‌స్వామి పేర్కొన్నారు. ప్రాచీన భారత సాంప్రదాయం ప్రపంచానికి అందించిన ఆమూల్య సంపద యోగా అన్నారు. వస్తువులు శుభ్రంగా ఉన్నట్లే మన శరీర ఆరోగ్యం కోసం పదిహేను నిమిషాలు కేటాయించాలని చిన జీయర్‌స్వామి సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం కళాశాల మైదానంలో వికాస తరంగిణి హనుమకొండ, వరంగల్ జిల్లాల సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ బచ్చు రాధాకృష్ణ అధ్యక్షతన యోగా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జీయర్ స్వామి హాజరై వికాస తరంగిణి సభ్యులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. క్షణం తీరిక లేని నేటి జీవన విధానంలో మనిషి ఎన్నో రుగ్మతలను ఎదుర్కొంటున్నారని, శారీరక వ్యాయామం తగ్గడంతోనే అనారోగ్యం పాలవుతున్నారని, జీవన శైలితో సంపూర్ణ ఆరోగ్యానికి పొందేందుకు అందరూ నిత్యం యోగా సాధన చేయాలన్నారు.అనంతరం జీయర్ స్వామితో కలిసి పోశాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు, నగర ప్రజలకు వినూత్న పద్ధతిలో యోగాసనాలు వేయించి సాధన చేయించారు. అంతకు ముందుగా వికాస తరంగిణి ప్రతినిధి డాక్టర్ బచ్చు రాధకృష్ణకు జీయర్‌స్వామి పూలమాల వేసి ఆశీర్వాదించారు. వికాస తరంగిణి ప్రతినిధులు డాక్టర్ బచ్చు మురళీకృష్ణ, భాస్కర్, రాము, పాకనాటి జ్యోతి, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాల పిలుస్తోంది..

- హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూళ్లల్లో ప్రవేశాలు
- ఒక్కో పాఠశాలలో 40 మంది బాలురు, 40 మంది బాలికలకు అవకాశం



భూపాలపల్లి అర్బన్ : రాష్ట్రంలోని మూడు క్రీడా పాఠశాలల్లో (హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్) 2024-25 విద్యా సంవత్సరానికి 4వ, 5వ తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది.ఈ నేపథ్యంలో స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి ఎలా దరఖాస్తు చేసుకోవాలి, ఎప్పుడు ఎంపికలుంటాయి, ఎలాంటి టెస్టులు పెడతారనే తదితర విషయాలపై ప్రత్యేక కథనం.

ఎంపిక విధానం..

రాష్ట్రంలోని మూడు ప్రాంతీయ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు తెలంగాణ జిల్లాస్థాయిలో ఎంపికలు స్పోర్ట్స్ స్కూల్ అధికారులు ప్రకటించారు. మేడ్చల్ జిల్లాలోని హకీంపేటలో, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో క్రీడా పాఠశాలలు ఉన్నాయి. విద్యార్థులకు శారీరక సామర్థ్యంతో పాటు పలు టెస్టులు నిర్వహించి ఎంపిక చేస్తారు. ఎవరైతే ప్రతిభ కనబర్చి ఎక్కువ స్కోర్ సాధిస్తారో వారికి ప్రవేశం కల్పిస్తారు. రాష్ట్రంలో మూడు స్పోర్ట్స్ స్కూళ్లు ఉండగా 40 మంది బాలురు, 40 మంది బాలికలకు అవకాశం ఉంటుంది. జిల్లాకేంద్రంలో విద్యార్థులకు శారీరక సామర్థ్యానికి సంబంధించిన పరీక్షలు మండల, జిల్లాస్థాయిలో నిర్వహించి రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలకు పంపిస్తారు.

మండలస్థాయి పోటీలకు..

మండలస్థాయి ఎంపిక పోటీలకు హాజరయ్యే విద్యార్థులు పాఠశాల హెచ్‌ఎంతో పాటు మున్సిపాలిటీ, పంచాయతీకి సంబంధించిన వయస్సు ధ్రువీకరణ పత్రం వెంట తెచ్చుకోవాలి. రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, 3వ తరగతి ప్రొగ్రెస్ రిపోర్టుతో మండలస్థాయి ఎంపిక పోటీలకు హాజరు కావాలి. ఈ నెల 25వ తేదీ వరకు ఎంఈఓ ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తారు. విద్యార్థులు శారీరక సామర్థ్య పరీక్షల్లో కనీసం 10 పాయింట్లు సాధిస్తే జిల్లాస్థాయికి పంపిస్తారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు.

జిల్లా స్థాయిలో ఎంపిక..

- ఈ నెల 27వ తేదీ నుంచి 30వ వరకు జిల్లా కేంద్రాల్లో జిల్లా క్రీడాశాఖ అధికారుల ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తారు. విద్యార్థులు శారీరక సామర్థ్య పరీక్షల్లో కనీసం 10 పాయింట్లు సాధిస్తే రాష్ట్రస్థాయికి పంపిస్తారు.

రాష్ట్రస్థాయిలో ఎంపికలు..

- జూన్ 8 నుంచి 12వ తేదీ వరకు హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తారు. ఆగస్టు రెండో వారంలో ప్రవేశాలు నిర్వహిస్తారు.

అర్హతలు..

- 4వ తరగతి ప్రవేశాలకు హాజరయ్యే విద్యార్థులు 2015 సెప్టెంబర్ 1, నుంచి 2016 ఆగస్టు 31 మధ్య జన్మించిన వారు అర్హులు. అలాగే దొడ్డి కాళ్లు, ప్లాట్ ఫీట్, వెన్నుముక వంగి ఉన్నవారు, గుండె సంబంధిత వ్యాధి గ్రస్తులు, బౌ లెగ్స్ ఉన్న వారు. ఎక్కడైన ఎముకలు విరిగిన వారు అనర్హులు.

మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహించే శారీరక సామర్థ్య పరీక్షలు

ఎత్తు, బరువు	మెడిసన్ బాల్ త్రో(కిలో బరువు)
30 మీటర్ల ఫ్లైయింగ్ స్టార్ట్	వర్టికల్ జంప్
స్టాండింగ్ బ్రాడ్ జంప్	ఫ్లెక్సిబిలిటీ టెస్ట్ (ముందుకు వంగి భూమిని తాకడం),
800 మీటర్ల రన్నింగ్	మెడికల్ టెస్ట్
6, 10 మీటర్ల షటిల్ రన్	

అర్హులు వినియోగించుకోవాలి

క్రీడాకారులుగా ఎదగాలనుకునే వారికి ఇది సువర్ణావకాశం. తెలంగాణ స్పోర్ట్స్ స్కూళ్లలో చదివి అంతర్జాతీయ స్థాయితో పాటు ఒలింపిక్స్ వంటి ఈవెంట్‌లో పాల్గొని సత్తాచాటిన క్రీడాకారులు ఎందరో ఉన్నారు. ఉన్నత, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన శిక్షణ స్పోర్ట్స్ స్కూల్‌లో లభిస్తుంది. చిన్నారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-రఘు, ఇన్‌చార్జ్ డీవైఎస్‌ఓ, జయశంకర్ భూపాలపల్లి

అనుమానాస్పదంగా మహిళ మృతి


- ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది: పోలీసులు
- కొట్టి..చంపేసి ఉరివేసుకుందని చిత్రీకరిస్తున్నారు: మృతురాలి కుమార్తె ఉమా



అనిత (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని సోమ్లాతండాకు చెందిన ఓ మహిళ మృతి చెందడం అనుమానస్పదంగా మారింది. కాగా భర్త మరణించడంతో ఆమె మనస్తాపానికి గురై ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని పోలీసులు తెలపగా, మృతురాలి కుమార్తె మాత్రం తన తల్లిని కొట్టి చంపి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా చిత్రీకరించారని ఆరోపించింది. దీంతో సదరు మహిళ మృతి అనుమానాస్పదంగా మారింది. రూరల్ ఎస్సై వి.దీపికారెడ్డి కథనం ప్రకారం..సోమ్లాతండా గ్రామానికి చెందిన గుగులోత్ అనిత (35) భర్త మంగిలాల్ మూడేళ్ల క్రితం మృతి చెందాడు. వీరికి కూతురు ఉమ, కుమారుడు సాయికృష్ణ ఉన్నారు. కూతురు ఉమాకి వివాహం కాగా, కుమారుడు సాయికృష్ణ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. అయితే భర్త లేదని అనిత కొంతకాలంగా మనస్తాపానికి గురవుతోంది. ఈ క్రమంలో ఆమె గురువారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి ఆమె మృతదేహన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై తెలిపారు.

కొట్టి.. హత్య చేశారు..కుమార్తె ఉమా



మండలంలోని సోమ్లాతండాకు చెందిన గుగులోత్ అనిత మృతిపట్ల ఆమె కుమార్తె ఉమా మాట్లాడుతూ తమ తల్లిని అదే తండాకు చెందిన గుగులోత్ బిచ్చు అనే వ్యక్తి కొట్టి చంపి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా చిత్రీకరించాడని ఆరోపించింది. గురువారం రాత్రి తన తల్లిని హత్య చేసిన బిచ్చుపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కన్నీరుమున్నీరుగా విలపించింది.

అత్తారింటిపై దాడి

- ఆరుగురిపై కేసు నమోదు

రఘునాథపల్లి : భార్య, పిల్లలను ఎందుకు తీసుకెళ్లవని ప్రశ్నించినందుకు ఓ వ్యక్తి మరో ముగ్గురితో కలిసి అత్తారింటిపై దాడికి పాల్పడిన సంఘటన మండలంలోని మండెలగూడెంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలగూడెం గ్రామానికి చెందిన అరూరి సారయ్య-సునీత దంపతుల కూతురు అఖిలను లింగాలఘణపురం మండలం నెల్లుట్లకు చెందిన బర్ల మల్లయ్య-సుజాత దంపతుల కుమారుడు ఉపేందర్‌తో వివాహం చేశారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కొన్నేళ్లుగా ఉపేందర్, అతని తల్లిదండ్రులు అదనపు కట్నం కావాలని అఖిలను వేధిస్తున్నారు. కాగా అఖిల కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కోసం వెళ్లి తల్లిగారింటి వద్దనే ఉంది. భార్య, పిల్లలను ఎందుకు తీసుకెళ్లడం లేదని అఖిల బంధువులు గురువారం ఉపేందర్‌కు ఫోన్ చేసి ప్రశ్నించారు. తననే ప్రశ్నిస్తారా అంటూ ఆగ్రహంతో ఉపేందర్ తన సోదరుడు మహేష్, మరో ఇద్దరితో కలిసి శుక్రవారం తెల్లవారు జామున అత్తగారింటికి చేరుకున్నారు. ఆరుబయట నిద్రిస్తున్న వారిపై దాడి చేశారు. ఈ ఘటనలో సారయ్య, సునీతకు తీవ్ర గాయాలయ్యాయి. వీరి అరుపులు విన్న చుట్టుపక్కల వారు లేచి రావడంతో నలుగురు పరారయ్యారు. గ్రామస్తులు వారి కోసం గాలించారు. గ్రామంలో ఉద్రిక్తత నెలకొనడంతో సమాచారం అందుకున్న ఎస్సై నరేష్ సిబ్బందితో అక్కడికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. దాడి చేసిన ఉపేందర్, సోదరుడు మహేష్, ఇద్దరు స్నేహితులతో పాటు వరకట్నం కోసం వేధించిన అత్తమామలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. దాడి చేసిన నిందితుల్లో ఇద్దరిని పోలీసులు అదుపులో తీసుకున్నట్లు సమాచారం.

జిమ్నాస్టిక్స్ కోచ్‌పై విచారణ

- శాట్ ఎండీ ఆదేశాలతో రంగంలోకి డీడీ



కోచ్‌లతో సమావేశమైన డీడీ చంద్రారెడ్డి

వరంగల్ స్పోర్ట్స్ : మానసికంగా తమను వేధిస్తున్నాడంటూ వరంగల్ రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్ జిమ్నాస్టిక్స్ క్రీడాకారులు అకాడమీ కోచ్‌పై మే నెలలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.ఈ మేరకు మే 17వ తేదీన 'ఈ కోచ్ మాకొద్దు..' అనే శీర్షికతోసాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనాన్ని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వీసీ, ఎండీ సీరియస్‌గా తీసుకున్నారు. ఫిర్యాదు చేసిన ఏడుగురు జిమ్నాస్టిక్స్ క్రీడాకారులను హైదరాబాద్‌లోని శాట్ ఎండీ ఆఫీస్‌కు పిలిపించి అసలేం జరిగిందని ఉన్నతాధికారులు అడిగి తెలుసుకున్నారు. కాగా విచారణ అధికారి శాట్ డిప్యూటీ డైరెక్టర్ చంద్రారెడ్డి శుక్రవారం హనుమకొండలోని ఇండోర్ స్టేడియంలోని డీఎస్ఏ వచ్చారు. జిల్లా యువజన, క్రీడల అధికారి గుగులోత్ అశోక్‌కుమార్‌తో కలిసి సమావేశమై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఒక్కో కోచ్‌ను విడివిడిగా విచారించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న కోచ్ పనితీరు, సమర్థుడేనా అంటూ అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. పనితీరు సరిగా లేని కోచ్‌లను ఉపేక్షించేది లేదని డీడీ చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. వారం రోజుల్లో విచారణపై పూర్తి స్థాయి నివేదిక బయటికి రానున్నట్లు తెలిసింది. అనంతరం బాలసముద్రంలోని స్విమ్మింగ్ పూల్‌ను సందర్శించి, క్రీడా వసతులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అలరించిన సాంస్కృతికోత్సవం



సాంస్కృతికోత్సవంలో పాల్గొన్న కళాశాల విద్యార్థులు

హన్మకొండ కల్చరల్ : ప్రపంచ సంగీత దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్‌లోని విద్యారణ్య ప్రభుత్వ సంగీత, నృత్యకళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పోతన విజ్ఞానపీఠం ఆడిటోరియంలో నిర్వహించిన సంగీత నృత్య విద్యార్థుల సాంస్కృతికోత్సవం అలరించింది. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుధీర్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సర్టిఫికెట్, డిప్లామా సంగీత, నృత్య కోర్సు విద్యార్థులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కర్ణాటక గాత్రం విద్వంసులు సింగారపు భాస్కర్ ఆధ్వర్యంలో కర్ణాటక గాత్ర విద్యార్థులు సిద్ధి వినాయకం మనిశం, సామజవరగమన, తిల్లాన, బ్రోచేవారెవరె రఘుపతే శ్రావ్యంగా ఆలపించారు. మృదంగ విద్వాంసులు వై.భీమ్‌శంకర్ సహకారం అందించారు. హిందూస్థానీ గాత్రం అధ్యాపకులు అనుముల యోష ఆధ్వర్యంలో విద్యార్థులు సహ్యా ధృత్‌ఖయాల్ -ఆలాప్-తాన్, రాగ్ షుధ్ సారంగ్ వినిపించారు. సితార్ అధ్యాపకులు జక్కోజు సత్యనారాయణ పైష్టంజనతో, రాగ్ పహాడిలో దున్, మియాకీ మల్హర్ ధృత్‌గత్ తీన్‌తాల్ వాయించి అలరించారు. తబల సహకారం జక్కోజు సత్యనారాయణ అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది గడ్డం శంకర్, దోనేపూడి ప్రవళిక విద్యార్థులు, తల్లిదండ్రులు, సంగీతాభిమానులు పాల్గొన్నారు.